

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 187 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 07, జూన్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# మేధావుల ధర్నా.. మార్మోగిన దేశం !






డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

అజ్ఞానుల ఆలోచనలను అదిమిపట్టే శక్తి రానే వచ్చిందని డాక్టర్ బరిగెల శివ అన్నారు.ప్రజలను బెదిరిస్తూ పరిపాలించడం ఎంతో కాలం సాగదని విద్యావంతులు, మేధావులైన యువత దేశవ్యాప్తంగా మేల్కొంటున్నారని కొనియాడారు.భారత రాజ్యాంగం పవర్ ఏంటో ఢిల్లీ జంతర్ మంతర్ గజ్జుమన్నవేళ నిరూపితమైందని తెలిపారు.ఇంతకాలం భారతదేశ మేధావులను అజ్ఞాన వ్యవస్థ లోనికి నెట్టివేస్తూ పాలించారని మేధావులు ఏం మాట్లాడినా కేసులు కట్టి జైళ్ళ పాలు చేసిన కేంద్ర అధికార పార్టీ బిజెపికి తిరుగు లేదని భావిస్తున్న తరుణంలోనే యావత్ ప్రపంచాన్ని ఒక్కసారి తన వైపు తిప్పుకున్న యువకుడు అమెరికా దేశం విడిచి స్వదేశమైన భారతదేశానికి తిరిగి వచ్చి ఢిల్లీ జంతర్ మంతర్ ఎయిర్పోర్ట్ వద్ద తన మొట్టమొదటి అభివాదాన్ని కనబరిచిన తీరు, భారత దేశ ప్రజలకు తనను తాను పరిచయం చేసుకున్న తీరు అద్భుతం అమోఘం అనితర సాధ్యంగా ఉందని కొనియాడారు.ఎడమ చేతితో లగేజ్ కుడి చేతితో భారత రాజ్యాంగాన్ని పట్టుకొని దేశ ప్రజలకు అభివాదం చేసిన తీరు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు దేశ ప్రజల కోసం కఠోరమైన కష్టాలను ఎదురుకొనుటకు సాహసవంతమైన నిర్ణయాలను తీసుకొని భారతదేశంలో అడిగిపెట్టినట్టుగా ఉందని గర్వంగా చెప్పారు.భారతదేశంలో సాంకేతికపరమైన సంస్థలు ఎన్నో ఉన్నప్పటికీ గుట్టు చప్పుడు కాకుండా తెరపైకి వచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం పార్టీ నిర్మాణం పార్టీ కార్యక్రమాలను బిజెపి ప్రభుత్వం అంత పెద్దగా పట్టించుకోలేదని ఏమాత్రం సీరియస్ గా పరిగణించలేదని

- మిగతా 2లో..

ఢిల్లీ పీఠంకాడ దద్దరిల్లిన ధర్నా

కదం తొక్కిన కాక్రోచ్ జనతా పార్టీ మేధావుల సమూహం

జల్లుమన్న జంతర్ మంతర్

కందిరీగల్లాగా వాలిపడ్డ మేధావి యువత

తన భవిష్యత్తును భారత రాజ్యాంగానికి అప్పగించిన అభిజిత్ దీప్కే

యువ నాయకుని అభివాదం దేశ ప్రజలకు ఆదర్శం

యువత మేల్కొంటున్న తీరు దేశ పురోగతికి నాంది లాంటిది

అణిచివేత అధికమైతే తిరుగుబాటు తీవ్రంగా ఉంటుంది

దేశ ప్రజలపై ఉక్కుపాదం మోపిన బిజెపికి ఉచ్చు బిగుస్తుంది

మేధావుల మేధోమదనం మంచి మార్గాలను నిర్ధారిస్తుంది

డాక్టర్ బరిగెల శివ




## నిరుద్యోగులకు శుభవార్త..

టీజీపీఎస్సీ నుంచి మరో ఉద్యోగ ప్రకటన

విద్యాశాఖలో డీవైఈవో, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పోస్టుల భర్తీ

మొత్తం 24 ఉన్నత స్థాయి పోస్టులకు టీజీపీఎస్సీ నోటిఫికేషన్

జూన్ 12 నుంచి జులై 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

పునర్వ్యవస్థీకరణ తర్వాత నియామక ప్రక్రియను వేగవంతం చేసిన కమిషన్

2




## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

ఇదే తమ మొదటి డిమాండ్..

కొనసాగిస్తాం కూడా

ప్రవేశ పరీక్షల అవతవకలకు బాధ్య వహించాల్సిందే

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే డిమాండ్

జంతర్ మంతర్ వద్ద ధర్నా...ధర్నాలో పాల్గొన్న పర్యావరణవేత్త వాంగ్‌చుక్




7

## ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

2

## వర్షాకాలం వస్తోంది జాగ్రత్త

ముందస్తు చర్యలకు సిద్ధం కండి

ధాన్యం కొనుగోళ్లు, సిఎం పర్యటనలపై జాగ్రత్తలు

కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎస్ ఆదేశాలు



7



## హైదరాబాద్‌కు ఉపశమనం.. పలు ప్రాంతాల్లో వర్షం

హైదరాబాద్‌లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం

వేసవి తాపం నుంచి నగరవాసులకు ఉపశమనం

గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, ఉప్పల్ సహా పలు ప్రాంతాల్లో జల్లులు

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

గత కొద్దిరోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న హైదరాబాద్ నగరవాసులకు శనివారం ఉపశమనం లభించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురియడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. శనివారం సాయంత్రం గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, బోరబండ, యూసుఫ్‌గూడ, ఎస్ఆర్ నగర్, సనత్‌నగర్, ఉప్పల్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో ఎండ వేడిమి నుంచి నగరవాసులకు ఊరట లభించింది. ఇక పొరుగున ఉన్న రంగారెడ్డి జిల్లాలోని కొహెడ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

జై భీమ్ POWER OF PEOPLE

# ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

## భూదందాలో సిఎం కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ ప్రముఖులు

## తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణలు



**హైదరాబాద్,జూన్6(జై భీమ్ న్యూస్):**

రూ. లక్ష కోట్ల ప్రభుత్వ భూమిని రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దలకు అప్పగిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు భూదందాలో చురుకుగా ఉన్నారని ఆరోపించారు. అయితే ఈ ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టు వరకు వెళ్లి తాము కాపాడుతామని స్పష్టం చేశారు. హైడ్రా..పేదల కాలనీల్లో దాడులు చేసి ఆ భూములను పెద్దలకు అప్పగిస్తోందని మండిపడ్డారు. శ్రీఆదిత్య కంపెనీ రివర్ బెడ్‌పైన ప్రాజెక్టు కడుతోందని.. ఆ కంపెనీ వెనుక ఓ ఎంపీ ఉన్నారన్నారు. శ్రీ ఆదిత్య కంపెనీకి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్ ఇచ్చారని.. దాన్ని ముట్టుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి నీళ్లపై అవగాహన లేదని కవిత విమర్శించారు. మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఏపీ సీఎం ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఏపీ సీఎంతో మాట్లాడి 200 టీఎంసీల నీళ్లు తెచ్చి ఆ తర్వాత బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. అప్పుడు కేటీఆర్ పాలన నడిచిందని.. ఇప్పుడు కూడా కేటీఆర్ పాలనే నడుస్తోందన్నారు. అప్పుడు కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, రామారావు.. ఇప్పుడు కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ పరస్పర సవాళ్లతో ఒరిగేదేమీ లేదని కవిత విమర్శించారు. తెలంగాణ బరాబర్ ప్రజల జాగీరే అని.. పవన్ కల్యాణ్ జాగీర్ కాదని కవిత స్పష్టం చేశారు. ఆంధ్రా విషకోరల నుంచి తెలంగాణను కాపాడుకున్నామన్నారు. ఇక్కడకు వచ్చి రాజకీయం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పవన్‌కు మద్దతు ఇస్తే నాలుగు ఓట్లు వస్తాయని బీజేపీ భావిస్తోందని.. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న 8 సీట్లు పోతాయన్నారు. పవన్ కల్యాణ్ 10 ఎకరాలు శిఖం భూమిని కొనుగోలు చేశారని.. కోడికుంట సర్వే నంబర్ 706లో శిఖం భూమి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అనేక తప్పులు జరిగాయని.. ఆ భూమిని పవన్ తిరిగి ఇచ్చేయాలన్నారు. శిఖం భూమిలో వేసిన కంచెను పవన్ తొలగించాలని కవిత డిమాండ్ చేశారు.

# కరీంనగర్‌లో కూలిన లిఫ్ట్

### ఎమ్మెల్యే కవ్వంపల్లికి తప్పిన ప్రాణాపాయం

**కరీంనగర్,జూన్6(జై భీమ్ న్యూస్):**

మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు పెను ప్రమాదం తప్పింది. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు కరీంనగర్‌కు ఎమ్మెల్యే వెళ్లారు. అయితే, కెమిస్ట్ భవన్ రెండో అంతస్తు నుంచి దిగుతూ లిఫ్ట్ ప్రమాదానికి గురైంది. సాంకేతిక కారణాల వల్ల లిఫ్ట్ ఒక్కసారిగా రెండో అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు పడిపోయింది. ప్రమాద సమయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లితో పాటు లిఫ్ట్‌లో మరో ఆరుగురు ఉన్నారు. ఏం జరుగుతుందో అర్థం కాక వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సిబ్బంది వెంటనే స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడటంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు, ఎమ్మెల్యే కవ్వంపల్లి లిఫ్ట్ ప్రమాదానికి గురయ్యారని తెలుసుకున్న నియోజకవర్గ ప్రజలు, ఆయన అభిమానులు ఆందోళన చెందారు.

# ఆపరేషన్ బ్లూ స్టార్ 42వ వార్షికోత్సవం

## అకాల్ తఖ్త్ వద్ద ఖలిస్తాన్ అనుకూల నినాదాలు

**చండీఘడ్,జూన్6(జై భీమ్ న్యూస్):**

పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న ప్రముఖ సిక్కు మత కేంద్రం అకాల్ తఖ్త్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆపరేషన్ బ్లూ స్టార్ 42వ వార్షికోత్సవం సందర్భంగా ఖలిస్థాన్ అనుకూల నినాదాలు వినిపించాయి. సిక్కు మిలిటెంట్ నాయకుడు జర్నైల్ సింగ్ భింద్రాన్‌వాలే పోస్టర్లు వెలిశాయి. జూన్ 6, 1984న భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ బ్లూ స్టార్‌లో భింద్రన్‌వాలే మరణించారు. ప్రతి ఏటా జూన్ 6వ తేదీన సిక్కు సమాజంలోని కొన్ని వర్గాలు 'ఘల్లోఘూరా దివస్'గా పాటిస్తాయి. ఈ ఏడాది కూడా భింద్రన్ వాలేను స్మరించుకుంటూ కొందరు కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలను కాపాడేందుకు పంజాబ్ పోలీసులు అమృత్‌సర్, దాని పరిసర ప్రాంతాలలో విస్తృతమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల ప్రత్యేక డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ కుమార్ సిన్హా జూన్ 4న జిల్లాలో పర్యటించి, బలగాల మోహరింపును సమీక్షించారు. దాదాపు 4,000 మంది పోలీసు సిబ్బందిని రక్షణ కార్యక్రమాల్లో భాగం చేశారు. కాగా, భింద్రన్‌వాలేను సిక్కు సమాజంలోని కొంతమంది అమరవీరుడిగా భావిస్తే, మరికొందరు ఆయనను పంజాబ్‌లో తీవ్రవాద ఉద్యమానికి ప్రతీకగా చూస్తారు.

# మేధావుల ధర్నా - మార్మోగిన దేశం






మొదటి పేజీ తరువాయి

తెలిపారు.భారతదేశ రాజకీయ వ్యవస్థలో రాజకీయ పార్టీలకు అతీతంగా రాజకీయ వ్యవస్థలకు ఏ విధమైనటువంటి సంబంధంలేని ఒక మేధావి యువకుడు భారతదేశ రాజకీయాలను ఇంతలా ప్రభావితం చేయగలిగారంటే దేశం అభివృద్ధి పురోగతి వైపు నిర్మాణం దాల్చాలనేది ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నట్లుగా ఉందన్నారు.దేశంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను పూర్తి ఆధారాలతో సోషల్ మీడియాలో కోట్ల కొలది విషయాలు వెల్లడించబడుతున్నప్పటికీ మొద్దు బారిన కొంతమంది నాయకులు రాజకీయాల ముసుగులో తీవ్రమైన అణిచివేతను ప్రదర్శిస్తున్నారని హెచ్చరించారు.

**రాజకీయ దాడులు నిర్మూలించబడాలి..**

రాజకీయాలన్నాక నాయకులను విమర్శించడం తప్పు పట్టకూడదనేది సహజమని భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్టు నుండి నేటి వరకు రాజకీయ పరిజ్ఞానవంతులను సైతం వదిలిపెట్టని విమర్శలు నేడు భారతదేశాన్ని పాలిస్తున్న పాలకులు ఎంతటి దుర్మార్గమైన పరిపాలనను కొనసాగిస్తున్నారో దేశ ప్రజలందరూ చూస్తున్నారని తెలిపారు.ఇలాంటి సందర్భాల్లోనే ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న నాయకులను విమర్శిస్తూ తప్పుపడుతూ దేశ ప్రజలకు వాళ్ల సమాచారాలను తెలియజేస్తున్న సోషల్ మీడియా ఆక్టివిటీస్తులను ఎక్కడికి అక్కడ అణచివేస్తూ రాజకీయ నాయకులు వాళ్లపై దాడులకు పాల్పడుతున్నారని తీవ్రంగా హెచ్చరించారు.సోషల్ మీడియా అనేది దేశవ్యాప్తంగా ప్రజలకు ఉపయోగకరంగా మాత్రమే ఉంటుందని మంచి అనేదాన్ని స్వీకరించుకుంటూ చెడు అనేదాన్ని వదిలివేయాలని సోషల్ మీడియాలో వస్తున్నటువంటి సమాచారాన్ని సీరియస్గా పరిగణించుకోవాల్సిన అవసరం లేదంటూ సాక్షాత్తు సుప్రీంకోర్టు అనేకసార్లు ఉత్తర్వుల రూపంలో దేశ రాజకీయ నాయకులకు తెలియజేసినప్పటికీని వాళ్ల వ్యక్తిగత హక్కులు దెబ్బతింటున్నాయంటూ సోషల్ మీడియా దారులపై రాజకీయ నాయకులపై వ్యతిరేకంగా మాట్లాడుతున్న మేధావులను రాజకీయ విశ్లేషకులను తీవ్రంగా దెబ్బ కొడుతూ రాజకీయ పరిశోధకులపై అత్యంత దారుణమైన దాడులకు పాల్పడుతున్నారని హెచ్చరించారు.దేశంలో జర్నలిస్టుల పరిస్థితి దినదినానికి తీవ్రమైన అణచివేతకు లోను చేయబడుతుందని ఒకప్పుడు జర్నలిస్టు అంటే రాజకీయ నాయకులకు వెన్నులో వణుకు పుట్టేదని ప్రస్తుత దేశ రాజకీయాల్లో రాజకీయ నాయకులే మీడియా సంస్థలను నిర్మించుకొని కొనసాగిస్తూ ప్రజల జీవితాలను దుర్బలంగా మారుస్తూ నీతిమాలిన రాతలను నిజాయితీపరుల్లా రాయించుకుంటూ సమాజాన్ని చెడగొడుతూ రాజకీయాల్లో చక్కని సందేశపరులమంటూ ఎలక్ట్రానిక్ మీడియా ముసుగులో దేశ ప్రజలను ఎటు కాకుండా చేస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు.రాజకీయ జీవితంలో కొనసాగుతున్న నాయకులు ప్రతిపక్ష నాయకులతో వాగ్వివాదాలు జరుగుతున్న సందర్భంలో అనేక బూతులు బూతులు తిట్టుకొనంగా లేనిది అనేక విమర్శలు చేసుకోనంగా లేనిది సోషల్ మీడియాలో రాజకీయంలో కొనసాగుతున్న అధికార వ్యక్తులను వాళ్లకు వ్యతిరేకంగా సంధిస్తున్న సమాచారాలను దృష్టిలో పెట్టుకొని వాళ్లను అణిచివేయడం దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో లక్షల సంఖ్యలో కోట్ల సంఖ్యలో పెరిగిపోతున్నాయని హెచ్చరించారు.రాజకీయ పదవుల్లో కొనసాగుతూ దుర్బలమైన జీవితాలను పాటిస్తున్న రాజకీయ నాయకులను విమర్శిస్తే తప్పేంటంటూ సూటిగా ప్రశ్నించారు ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి రాజ్యాంగ విలువలను గాలికి వదిలేస్తూ ప్రజలను తీవ్రంగా మోసం చేస్తున్న నాయకులను కచ్చితంగా విమర్శించి తీరాల్సిందే అంటూ అలాంటి నాయకులే రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతూ ప్రతిపక్షాలను ఎదుర్కొన దమ్ము లేక ప్రజాసేవ చేతగాక సామాన్య ప్రజలపై సాధారణ సోషల్ మీడియా ఆక్టివిటీ దారులపై కేసులుకాడుతూ బెదిరింపులకు గురిచేస్తూ సమాజాన్ని ప్రజల వ్యక్తిగత ఆత్మ గౌరవాన్ని పూర్తిగా దెబ్బతీస్తున్నారని వీటన్నిటి ఆలోచనలోకి తీసుకొనగా పుట్టుకొచ్చినదే కాక్రోచ్ జనతా పార్టీ అని కొనియాడారు.రాజకీయ ప్రజాప్రతినిధులు ప్రజలకు మేలు చేశాక కొత్త రాజకీయ పార్టీలు ఎందుకు పుట్టుకొస్తాయంటూ సూటిగా అడిగారు.తమిళనాడు రాష్ట్రంలో బిజెపి మాజీ అధ్యక్షుడు మాజీ ఐపీఎస్ అధికారి అన్నమలై బిజెపి పార్టీకి బిజెపి అధ్యక్ష పదవికి ,బిజెపి సభ్యత్వానికి రాజీనామా చేసి దేశ ప్రజల ప్రయోజనార్థం కొత్త పార్టీని పెట్టుకుని సామాజిక దృక్పధ కోణంలో పార్టీ సభ్యత్వాన్ని ప్రారంభించగా కేవలం 24 గంటల్లోనే 14 లక్షల మంది యువత పార్టీలో చేరడం అత్యంత విశ్వాసనీయమన్నారు.ఈ విధంగా దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో రాజకీయాలన్నీ మేధావులతో నిండుకోవాలని సూచించారు.రాజకీయ అధికార పదవులతో ప్రజలను ప్రభావితం చేయలేని నాయకులందరూ పరోక్ష మార్గాల్లో ప్రజలను వేధిస్తూ ప్రజాస్వామ్యవాదులను వేధిస్తూ మేధావులను వేధిస్తూ ప్రతిపక్షాలను వేధిస్తూ పబ్బం గడుపుకునే ఆలోచనలను బలపరచుకుంటారు తప్ప ప్రజాస్వామ్య విలువలు కట్టుబడి రాజ్యాంగ నియమాలకు లోబడి రాజకీయ పరిపాలనను కొనసాగించలేరు అనేది పచ్చి వాస్తవం అన్నారు.

**మేధావులారా ముందుకు రండి..**

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అభిజిత్ దీప్కే శనివారం ఢిల్లీ జంతర్ మంతర్ ఉద్యమ గడ్డపై తలపెట్టిన మేధావుల ధర్నా దేశవ్యాప్తంగా ప్రధాన చర్చనీయాంశంగా మారిపోయిందన్నారు.మేధావి యువకుడిగా తన బాధను దేశ ప్రజలకు తెలియజేసిన విధానాన్ని మేధావులే కాకుండా దేశ ప్రజలందరూ గమనించాల్సి ఉంటుందన్నారు.కేవలం వ్యక్తిగత స్వార్థం కోసమైతే సంపన్నుల దేశంలో స్థిరపడ్డ అభిజిత్ దీప్కే దేశ ప్రజల ప్రయోజనం కోసం ఇంతటి క్లిష్టమైన కఠినమైన శ్రమతో కూడిన కష్టాలను ఎందుకు కొని తెచ్చుకోవాలంటూ దేశ ప్రజలకు తెలిపారు.కోట్లాదిమంది అభిమానాన్ని చురగొన్న కాక్రోచ్ జనతా పార్టీ అధినేత శనివారం తలపెట్టిన మహాధర్నాలో దేశంలోని లక్షలాదిమంది నీట్ యువత ప్రశ్నాపత్రం లీక్ అవ్వడం వల్ల పరీక్ష రద్దు కావడంతో ఇప్పటివరకు సుమారుగా 17 మంది ప్రాణాలు కోల్పోయారని అది పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందంటూ తన ఆవేదన వ్యక్తపరచడంతో పాటుగా ఢిల్లీ జంతర్ మంతర్ ప్రాంతంలో మహా ధర్నాకు పిలుపునివ్వగా మేధావి వర్గం అంతా కదిలి వచ్చి ధర్నాను పూర్తిస్థాయిలో విజయవంతం చేశారని అభినందించారు.ఈ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ అధినేత అభిజిత్ దీప్కే ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ 17 మంది నీట్ విద్యార్థుల బలవన్మరణాలకు కారకుడైన కేంద్ర విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారన్నారు.దోషులను కఠినంగా శిక్షించాలని హెచ్చరించారన్నారు.చనిపోయిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నీట్ విద్యార్థులు ఎవరు ఆత్మహత్యలు చేసుకోకూడదని మీ తరఫున పోరాడడానికి మేమున్నామంటూ హామీ ఇవ్వడం యువతలో కొంతమేర చైతన్యాన్ని రేకెత్తించిందన్నారు.తను మాట్లాడుతూ అమెరికా నుండి న్యూ జెర్సీకి బయలుదేరే ముందు నా కొడుకు వెళ్లి పోతున్నాడు అంటూ నాతోపాటు ఇంక ఎవరుంటారంటూ నా తల్లి ఎంతగానో ఏడ్చిందని మాట్లాడిన విషయాలను గుర్తు చేశారు.ఆ బాధ నేను అర్థం చేసుకోగలను అంటూ కానీ ఇప్పుడు నేను భారతదేశానికి తిరిగి వస్తున్న సమయంలో నా తల్లి మొదటిసారి లాగా ఏడవలేదని తన ఆవేదనను తెలిపారన్నారు.గత రెండు మూడు రోజులుగా మా అమ్మ మా సోదరి ఎంతో ఏడుస్తున్నారని నన్ను తిరిగి వెళ్లిపొమ్మని లేదంటే నన్ను జైల్లో పెడతారని అంటున్నారని తెలిపారన్నారు.నేను ఇంటికి వెళ్తున్న సందర్భాల్లో వాళ్లకు భయం వేస్తుందని కానీ ఇలాంటి భయం మా అమ్మకు మాత్రమే కలగడం లేదని ఈ దేశంలో ఏ వ్యక్తి అయినా ఏ యువత అయినా రాజకీయాలకు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మాట్లాడుతుంటే వాళ్లను జైల్లో పెడతారంటూ వాళ్ల తల్లిదండ్రులు భయపడుతున్నారని తెలిపారన్నారు.ఎప్పటివరకు భయపడతామంటూ వాళ్లు భయపెట్టే రాజకీయాలకు మనం భయపడకూడదని దేశంలోని యువతకు తెలుపుతూ దేశ యువతకు విద్యార్థులకు అండగా నిలిచే విధంగా తన మొదటి రాజకీయ ధర్నా ప్రసంగంతో దేశ ప్రజలనే కాదు దేశంలోని మేధావులను దేశ రాజకీయ వర్గాలను రాజకీయ విశ్లేషకులను పూర్తిస్థాయిలో ఆకట్టుకోగలిగారన్నారు.రాజకీయ పండితులందరూ కాక్రోచ్ జనతా పార్టీతో దేశానికి పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చునని విమర్శలు చేస్తున్న సందర్భంలోనే ఢిల్లీ కేంద్ర ప్రభుత్వం పీఠం దగ్గర ధర్నా నిర్వహించి రాజకీయ వర్గాలను రాజకీయ పండితులను ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురి చేశారని తెలిపారు.మేధావులంతా కదిలి రావాలని దేశాన్ని రక్షించుకునే భాగంలో త్యాగాలు తప్పవంటూ గుర్తు చేశారు.ప్రస్తుతం భారతదేశం ఎంతో కష్టంలో ఉందని అలాంటి కష్టంలో నుండి యువత, మేధావులు, విద్యార్థులు పూర్తిస్థాయిలో కాపాడుకొనుటకు సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు.కాక్రోచ్ జనతా పార్టీకి దినదినం పెరుగుతున్న ఆదరణ చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతుందని స్పష్టంగా వెళ్ళడౌతుండగా పైపైకి మాత్రం బిజెపికి తిరుగులేని ఆదరణ కలగంటూ భజన మీడియాలలో ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు.కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించబోయే మేధావుల కార్యక్రమాలలో, దేశ రక్షణ కార్యక్రమాలలో భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తున్న ప్రతి ఒక్కరు పాల్గొని దేశంలోని నిజాయితీ వైపు నిలబడాలని పిలుపునిచ్చారు.

# పంజాబ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### ఎదురెదురుగా ఢీకొన్న ట్రక్కులు

### 8మంది ప్రయాణికుల దుర్మరణం

చండీగఢ్: పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్–ఫాజిల్కా రహదారిపై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు ట్రక్కులు ఎదురెదురుగా ఢీకొని 8మంది ప్రాణాలు కోల్పోగా.. 15మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులంతా ఇటీవల మృతిచెందిన తమ బంధువు అస్థికలను నీటిలో కలిపేందుకు వెళ్తుండగా ఈ ఘోరం జరిగింది. ప్రమాదానికి గురైన వారిని జలాలాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు. బాధితులు తమ బంధువు అస్థికలను తీసుకుని బియాస్‌లోని రాధా సోమి దేరాకు శనివారం ఉదయం ప్రయాణం మొదలుపెట్టారు. సుమారు 25 మంది మహీంద్రా పికప్ వాహనంలో బయలుదేరారు. అయితే, వాహనం జంగవాలా గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా వచ్చిన మరో ట్రక్కును ప్రమాదవశాత్తూ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మరణించగా.. మరో నలుగురు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, వైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని ఫిరోజ్‌పూర్‌లోని సివిల్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. కుటుంబ సభ్యులు, బంధువుల మృతితో ప్రమాద స్థలం, ఆస్పత్రి ప్రాంగణంలో బాధితుల రోదనలు మిన్నంటాయి.

# వశిష్ట గోదావరిలో పడి యువకుడు మృతి

**భీమవరం,జూన్6(జై భీమ్ న్యూస్):**

పశ్చిమగోదావరి జిల్లా వశిష్ట గోదావరి నదిలో స్నానానికి దిగి ఓ యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషాద సంఘటన ఆచంట మండలంలో చోటు చేసుకుంది. పిప్పర గ్రామానికి చెందిన జక్కంశెట్టి భానుప్రసాద్ (18) అనే యువకుడు వల్లూరు పంచాయతీ గెద్దాడవారిపాలెం లోని తన అమ్మమ్మ ఇంట్లో ఉంటూ ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటున్నాడు. శుక్రవారం తన స్నేహితులతో కలిసి కరుగోరుమిల్లి పురస్కార రేవు వద్ద సరదాగా గోదావరిలో స్నానానికి దిగిన భానుప్రసాద్, అకస్మాత్తుగా కాలుజారి నీటిలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ÷ర్ సిబ్బంది గజఈతగాళ్లతో గాలించగా శుక్రవారం రాత్రికి భానుప్రసాద్ మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి గతంలోనే మరణించగా, తల్లి ఉపాధి కోసం విదేశాల్లో ఉంటోంది. కంటికి రెప్పలా చూసుకుంటున్న మనవడు కళ్లముందే అనంతలోకాలకు వెళ్లిపోవడంతో అమ్మమ్మ, తాతయ్యలతో పాటు బంధువులు, స్నేహితుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఆచంట ఎస్సై కే. వెంకటరమణ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ఈవీఎంల గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి





**హన్మకొండ, 6 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్ భవనం వెనుక ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎంలు), వివిప్యాట్‌లు భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి శనివారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా ఈ పరిశీలన చేపట్టారు. గోదాములో పటిష్ట భద్రతా ఏర్పాట్ల మధ్య భద్రపరిచిన ఈవీఎంలు, వివిప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు మరియు ఎన్నికల సామగ్రి నిల్వ ఉంచిన గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాం భద్రతా వ్యవస్థల పనితీరును సమీక్షించిన కలెక్టర్, సీసీ కెమెరాల నిర్వహణ, రికార్డింగ్ వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయా అనే అంశాలను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఈవీఎంల నిల్వ, నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించి సంతకాలు చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నట్లు అధికారులతో చర్చించారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇ.వి. శ్రీనివాసరావు, రావు అమరేందర్ రెడ్డి, కుసుమ శ్యాంసుందర్, నాగబెల్లి రజనీకాంత్, సయ్యద్ ఫైజుల్లా, మణి, లక్ష్మణ్, ఎం.డి. నేహాల్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడేందుకు ఇటువంటి క్రమానుగత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# సర్వే పనులను గడువులోగా పూర్తి చేయాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**హన్మకొండ, 6 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలో కొనసాగుతున్న భూ సర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భూ రికార్డులు, భూ కొలతల శాఖ అధికారులు, సర్వేయర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన వివిధ సర్వే కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, పట్టా భూముల హద్దుల నిర్ధారణ, గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించిన సర్వేలు, రీ-సర్వే కార్యక్రమాలు, చెరువుల శిఖం (వెట్‌ల్యాండ్స్) భూముల గుర్తింపు, కొలతలు తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రత్యేకంగా చెరువు శిఖం భూముల సర్వేకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ భూముల పరిరక్షణ పర్యావరణ సమతుల్యతకు ఎంతో కీలకమని పేర్కొంటూ, గుర్తింపు మరియు కొలతల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.



అలాగే జానకీపురం, ముచ్చర్ల గ్రామాల్లో కొనసాగుతున్న రీ-సర్వే పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, పెండింగ్ అంశాలను పరిష్కరించాలని సూచించారు. భూ వివాదాల పరిష్కారం, భూ రికార్డుల పారదర్శక నిర్వహణలో సర్వే కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఖచ్చితత్వంతో కూడిన సర్వే నిర్వహణ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని, ప్రతి కేసును బాధ్యతాయుతంగా పరిశీలిస్తూ నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో భూ రికార్డులు, భూ కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు సారంగపాణి, రాజనర్సయ్యతో పాటు జిల్లాలోని 14 మండలాల సర్వేయర్లు పాల్గొన్నారు. సర్వే పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

# ట్రాన్స్‌జెండర్ సమాజ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

**హన్మకొండ, జూన్ 6 (జై భీమ్ న్యూస్)**


జిల్లాలో నివసిస్తున్న ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులకు అధికారిక గుర్తింపు, సంక్షేమ పథకాల అందుబాటు మరియు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో నిర్వహించిన ట్రాన్స్‌జెండర్ ఐడెంటిటీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అర్హులైన సభ్యులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్ సమాజానికి కూడా ఇతర పౌరుల మాదిరిగానే సమాన హక్కులు, అవకాశాలు లభించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, విద్య, ఉపాధి, ఆరోగ్య సేవలు వారికి సులభంగా చేరేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి జిల్లా పరిపాలన ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. గుర్తింపు కార్డులు ట్రాన్స్‌జెండర్ సభ్యులకు అధికారిక గుర్తింపును కల్పించడంతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర సలహాదారుడు ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ట్రాన్స్‌జెండర్ సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు కృషి జరుగుతోందని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా, నాయిని రాజేందర్ రెడ్డి



ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులకు రాజకీయ, సామాజిక రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కార్యదర్శి పదవి ఇవ్వడం అభినందనీయమని శ్రీనివాస్ రావు అన్నారు. ఇది ట్రాన్స్‌జెండర్ సమాజంలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరి సామాజిక సేవా కార్యక్రమాల్లో ట్రాన్స్‌జెండర్ సభ్యులు చురుకుగా పాల్గొనడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఓరుగంటి లైలా మాట్లాడుతూ, కమ్యూనిటీ సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కృతజ్ఞతలు తెలిపారు. గుర్తింపు కార్డుల పంపిణీతో ప్రభుత్వ పథకాల లబ్ధి మరింత సులభంగా అందుతుందని అన్నారు. ట్రాన్స్‌జెండర్‌ల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి విశ్వజ, ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులు రింషా, హనీ, శాఖ సిబ్బంది వెంకటరమణ, రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు.

# డీఈఈసెట్-2026 ప్రవేశాల ప్రక్రియకు వేగం


### ప్రాథమిక కీ విడుదల.. వెబ్ ఆప్షన్లకు అవకాశం.. జూన్ 14న సీట్ల కేటాయింపు




**హైదరాబాద్/వరంగల్, 6 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ డీఈఈసెట్-2026 (టీజీ డిఈఈసెట్-2026) ప్రవేశాల ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డి.ఈఐ.ఎడ్), డిప్లొమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్ (డి.పి.ఎస్.ఈ) కోర్సుల్లో 2026-28 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీని అధికారులు విడుదల చేశారు. అదే సమయంలో అర్హత సాధించిన అభ్యర్థులకు వెబ్ ఆప్షన్ల నమోదుకు షెడ్యూల్‌ను ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్‌లు, ప్రైవేట్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ సంస్థలు (మైనారిటీ, నాన్-మైనారిటీ)లో ప్రవేశాల కోసం నిర్వహించిన డీఈఈసెట్-2026 పరీక్ష అనంతరం సర్టిఫికెట్ ధృవీకరణ ప్రక్రియను జూన్ 2 నుంచి 5 వరకు రాష్ట్రంలోని 10 ప్రభుత్వ డైట్‌లలో నిర్వహించారు. వెరిఫికేషన్‌కు హాజరుకాని అభ్యర్థులకు ప్రత్యేక అవకాశం కల్పిస్తూ జూన్ 6 మధ్యాహ్నం 2 గంటల వరకు గడువు పొడిగించారు. అర్హత పొందిన అభ్యర్థులు జూన్ 6 మధ్యాహ్నం 3 గంటల నుంచి జూన్ 8 వరకు అధికారిక వెబ్‌సైట్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. కళాశాలల ఎంపికకు సంబంధించిన ఆప్షన్లను నమోదు చేసిన అనంతరం జూన్ 9న వాటిని సవరించుకునేందుకు ఎడిట్ ఆప్షన్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. ఇక పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీని కూడా విడుదల చేసిన అధికారులు, అభ్యర్థులు దానిని పరిశీలించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. అందిన అభ్యంతరాలను నిపుణుల కమిటీ పరిశీలించి తుది కీని విడుదల చేయనుంది. విద్యార్థులకు సీట్లు, కళాశాలల కేటాయింపును జూన్ 14న ప్రకటించనున్నారు. అదే రోజు నుంచి జూన్ 17 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి కళాశాల అలాట్‌మెంట్ లేఖను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు జూన్ 17లోగా సంబంధిత కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని అధికారులు సూచించారు. కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించిన తరగతులు జూలై 1 నుంచి ప్రారంభం కానున్నట్లు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, టీజీ డీఈఈసెట్-2026 కన్వీనర్ జి. రమేష్ తెలిపారు. డీఈఈసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకుని ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు కోరారు.

# వరంగల్‌లో జూన్ 18న ప్రజావాణి కార్యక్రమం




**వరంగల్, 5 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు జిల్లా పరిపాలన ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని జూన్ 18న సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. వరంగల్, ఖిలా వరంగల్, గీసుగొండ మండలాలకు చెందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు నిర్ణీత సమయానికి హాజరుకావాలని సూచించారు. తమ పరిధిలోని పాఠశాలలకు సంబంధించిన సమస్యలు, ఇబ్బందులు, అవసరాలను సంబంధిత వివరాలతో ప్రజావాణిలో తెలియజేయాలని పేర్కొన్నారు. అలాగే సమావేశానికి వచ్చే అధికారులు, ఉపాధ్యాయులు సంబంధిత సమస్యలపై పూర్తి సమాచారం, అవసరమైన పత్రాలతో హాజరుకావాలని సూచించారు. ప్రజావాణి ద్వారా విద్యా శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి అవకాశం కల్పిస్తున్నందున సంబంధిత వారంతా తప్పనిసరిగా పాల్గొనాలని జిల్లా విద్యాశాఖాధికారి కోరారు.

# నవజాత శిశువుల ఆరోగ్యం గుర్తింపు

**అమరావతి,జూన్6(జై భీమ్ న్యూస్):**

నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాలను సులభంగా, ఖచ్చితంగా గుర్తించేందుకు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ఆధారంగా పనిచేసే 'శిశు మాపన్' యాప్‌ను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఈ నూతన విధానం ద్వారా పుట్టిన పిల్లలను చేతులతో తాకాల్సిన అవసరం లేకుండానే.. కేవలం మొబైల్ వీడియో ద్వారా వారి ఆరోగ్య వివరాలను రికార్డు చేయవచ్చు. సాధారణంగా నవజాత శిశువుల బరువు, ఎత్తు, తల, ఛాతీ చుట్టుకొలతలను సాంప్రదాయ పద్ధతుల్లో కొలవడం కొంత శ్రమతో కూడుకున్న పని. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు గాను.. ప్రస్తుతం వినియోగంలో ఉన్న 'ఆశా' యాప్‌తో ఈ 'శిశు మాపన్' యాప్‌ను అనుసంధానించారు. ఈ సరికొత్త ప్రాజెక్ట్‌ను మంగళగిరి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎం లకు ఈ యాప్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ కూడా పూర్తి చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

# మహిళల భద్రత పోలీసుల ప్రధాన లక్ష్యం

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**ధర్మసాగర్, 6 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

మహిళల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో శనివారం ధర్మసాగర్ మండలం పెండ్యాల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడిన సీపీ, మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలు అన్ని రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారని, తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి ఆత్మస్థైర్యం, పట్టుదల అవసరమని పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్ సమర్థవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురైతే మౌనంగా ఉండకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పిల్లలకు ఉన్నత విద్య అందించడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, కుటుంబం మరియు సమాజ అభివృద్ధికి మహిళల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై కూడా ఆయన అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ధర్మసాగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రావు, స్థానిక సర్పంచ్, రెవెన్యూ అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఫార్మసిస్ట్‌ల భవిష్యత్తుకు ఆధారం ఏపీ ఫార్మసీ కౌన్సిల్ పాలకమండలి ఏర్పాటు

**ఫార్మసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు డా. ఎం. సురేష్ బాబు**



**కడప, 6 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ఆంధ్రప్రదేశ్‌లో ఫార్మసిస్ట్‌ల సమస్యల పరిష్కారానికి ఫార్మసీ కౌన్సిల్ పాలకమండలి ఏర్పాటు కీలకమని ఫార్మసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు డా. ఎం. సురేష్ బాబు అన్నారు. శనివారం కడప నగరంలోని రామాంజనేయపురంలో ఉన్న ఫార్మసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫార్మసిస్ట్‌ల పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఫార్మసీ కౌన్సిల్‌కు పాలకమండలి ఏర్పాటు చేయడం ద్వారా దాదాపు 25 సంవత్సరాలుగా ఎన్నికల కోసం ఎదురుచూస్తున్న ఫార్మసిస్ట్‌లకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఎనిమిది వేలకుపైగా రిజిస్ట్రేషన్ రెన్యూవల్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని, పెండింగ్ రెన్యూవల్స్‌పై ఎలాంటి పెనాల్టీలు విధించకుండా ఉచితంగా పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఫార్మసీ సంఘాల తరఫున విజ్ఞప్తి చేశారు. ఫార్మసీ యాక్ట్--1948, సెక్షన్ 42 మరియు డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్--1940, సెక్షన్ 65 ప్రకారం ప్రతి మెడికల్ స్టోర్‌లో అర్హత కలిగిన ఫార్మసిస్ట్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. అయితే ఈ నిబంధనలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు. ఫార్మ్-డి (డాక్టర్ ఆఫ్ ఫార్మసీ) కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. పార్లమెంట్‌లో క్లినికల్ ఫార్మసిస్ట్‌లుగా గుర్తింపు పొందినప్పటికీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పి.హెచ్.సీలు), కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు (సీ.హెచ్.సీలు) వంటి ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఉద్యోగాలు కల్పించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ఔషధ విక్రయాల నేపథ్యంలో అర్హతలేని వ్యక్తులు ఫార్మసిస్ట్‌లమని చెప్పుకుంటూ వ్యవహరించడం పెరుగుతోందని, ఇది ప్రజారోగ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రతి మెడికల్ షాప్‌లో 100 శాతం అర్హత కలిగిన ఫార్మసిస్ట్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు డా. రాధాకృష్ణ, యు. ఉమామహేశ్వర రావు, బాలకృష్ణ, సుబ్బారెడ్డి, కోట సుబ్బారావు, చలపతి తదితరులు పాల్గొన్నారు.ం

# కరణం ప్రహ్లాద రావు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న - శరత్ కుమార్ రెడ్డి

**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**




వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలోని వివేకానంద కళాశాల ఆవరణలో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ వికారాబాద్ జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద్ రావు జన్మదిన వేడుకలో, బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు, కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్ రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పరిగి నియోజకవర్గ కార్యకర్తలు మరియు నాయకులు పాల్గొన్నారు.

# నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలి





**రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు**

**హైద్రాబాద్, 6 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో జూన్ 21న నిర్వహించనున్న నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా యంత్రాంగాలకు ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి అదనపు డీజీపీ మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో నీట్-2026 పరీక్ష నిర్వహణ, వరి ధాన్యం కొనుగోలు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 24 పట్టణాల్లో 208 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నీట్-2026 పరీక్షకు 72,956 మంది విద్యార్థులు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర, జిల్లా స్థాయి సమన్వయ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో వ్యాపించే వదంతులపై వెంటనే స్పందించి అసత్య ప్రచారాన్ని అరికట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష నిర్వహణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష రోజున ప్రశ్నపత్రాల రవాణా, అభ్యర్థుల రిజిస్ట్రేషన్, బయోమెట్రిక్ ధృవీకరణ, భద్రతా తనిఖీలు, బందోబస్తు ఏర్పాట్లు నిరాటంకంగా జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోళ్లపై మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. 4,488 కొనుగోలు కేంద్రాలను మూసివేసినట్లు వెల్లడించారు. అలాగే 10.58 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.13,577 కోట్ల కనీస మద్దతు ధర జమ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. మహిళా సంఘాల సాధికారత కోసం రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు ఒక్కో బస్సు చొప్పున మొత్తం 553 బస్సులను మంజూరు చేసినట్లు తెలిపారు. జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ బస్సులను లాంఛనంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. సభ విజయవంతానికి గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జూన్ 12న రాష్ట్రంలోని పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు అందించాల్సిన యూనిఫారాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అదనపు డీజీపీ మహేష్ భగవత్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలపై నిరంతరం నిఘా ఉంచి తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహిళా అభ్యర్థుల తనిఖీ కోసం ప్రతి కేంద్రంలో మహిళా కానిస్టేబుళ్లను అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. జూన్ 21న సీకేఎం గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6.15 గంటల వరకు నిర్వహించనున్న నీట్ పరీక్షకు 480 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. సంబంధిత శాఖల సమన్వయంతో పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) వైవి గణేష్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, ఆర్డీవో సుమతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమంలో 10% లక్ష్యాన్ని మించి నమోదు పెంచాలి





## ఎఐ ఆధారిత విద్య, సమ్మిళిత విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, ఐఏఎస్

**వరంగల్, 6 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచేందుకు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం--2026-27 అమలుపై జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, ఐఏఎస్ శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో నమోదు పెంపుపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి ప్రభుత్వం నిర్దేశించిన 10 శాతం లక్ష్యాన్ని మించి విద్యార్థుల నమోదును పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పాఠశాల స్థాయిలో ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి, ఇంటింటి ప్రచారం, తల్లిదండ్రులతో సమావేశాలు, ప్రభుత్వ విద్యాసంస్థల ప్రత్యేకతలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కృత్రిమ మేధస్సు (ఎఐ) ఆధారిత విద్యకు ప్రాధాన్యతనిస్తూ, విద్యార్థుల అభ్యాస నైపుణ్యాల పెంపు కోసం డిజిటల్ విద్యా వనరులను సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. విద్యార్థులందరికీ ఆధునిక సాంకేతిక విద్య అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమ్మిళిత విద్య (ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్)ను మరింత బలోపేతం చేయాలని పేర్కొంటూ, భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల (సీడబ్ల్యూఎస్ఎన్) నమోదును పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారికి ప్రభుత్వం అందిస్తున్న విద్యా సహాయాలు, ఉపకరణాలు, ప్రత్యేక శిక్షణ, ఫిజియోథెరపీ, పునరావాస సేవలు సకాలంలో అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భవిత కేంద్రాల సేవలపై ప్రజలకు, తల్లిదండ్రులకు విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంపులో వినూత్న పద్ధతులు అవలంబించి విశేష ఫలితాలు సాధించిన విద్యాధికారులకు ప్రభుత్వం విదేశీ పర్యటన అవకాశాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు. జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలలను గుర్తించి, బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల నమోదు చేపట్టి వాటిని పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసిన ప్రతి విద్యార్థి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, శానిటరీ సోక్‌పిట్స్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోషకాహార కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి శుక్రవారం "ఫ్రైడే డ్రై డే" నిర్వహించి, దోమల ద్వారా వ్యాపించే అంటువ్యాధులు, ఇతర కమ్యూనికబుల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వై.వి. గణేష్, ఐఏఎస్, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, ఏఎంఓ సుజన్ తేజ, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి డా. కె. శ్రీనివాస్, డీఐఈఓ శ్రీధర్ సుమన్, డిగ్రీ కళాశాలల నోడల్ అధికారి డా. నవీన్, మండల విద్యాధికారులు (ఎంఈఓలు), స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధి, పిల్లల రక్షణలో బాల పంచాయతీల పాత్ర కీలకం: డీసీపీ ధార కవిత

**హన్మకొండ, 6 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**





గ్రామాభివృద్ధి మరియు పిల్లల రక్షణలో బాల పంచాయతీలు కీలక భూమిక పోషిస్తాయని వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా, తెలంగాణ స్టేట్ విమెన్ సేఫ్టీ వింగ్ సూచనల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపాడు గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బాల పంచాయతీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ ధార కవిత మాట్లాడారు. పిల్లల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, వారి సమస్యలను వారే గుర్తించి పరిష్కార మార్గాలను సూచించేలా చేయడం బాల పంచాయతీల ప్రధాన ఉద్దేశమని ఆమె తెలిపారు. పోలీసు శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాల పంచాయతీ సభ్యులు తమ గ్రామం, పాఠశాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. పిల్లలు గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. భవిష్యత్తులో గ్రామాభివృద్ధి, పిల్లల సంక్షేమం, పాఠశాల అభివృద్ధిలో బాల పంచాయతీల పాత్ర మరింత పెరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా బాల పంచాయతీకి ఎన్నికైన విద్యార్థులను అభినందించి, డీసీపీ చేతుల మీదుగా వారికి బ్యాడ్జీలు అందజేశారు. బాల పంచాయతీ కార్యక్రమాల నమోదు కోసం రూపొందించిన రిజిస్టర్ బుక్‌లెట్‌ను కూడా ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న విమెన్ సేఫ్టీ వింగ్ హైదరాబాద్ డీఎస్పీ ఎర్రా మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టు కింద ఎనిమిది గ్రామాల్లో బాల పంచాయతీలను ప్రారంభించినట్లు తెలిపారు. పిల్లలు గుర్తించిన ప్రతి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మై ఛాయిసెస్ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ జన్ను క్రాంతి, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ జాన్ నరసింహులు, సీఐ మహేందర్, ఎస్సై రవి, సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర్, షీ టీమ్ ఎస్సై స్వాతి, ఎంఈఓ శ్రీనివాస్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్సై సుధాకర్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# యూ - విన్ పోర్టల్‌లో గర్భిణీలు, శిశువుల వివరాల నమోదు తప్పనిసరి

### జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. సాంబశివరావు






**వరంగల్, 6 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సంస్థలు గర్భిణీలు, ప్రసవించిన తల్లులు మరియు నవజాత శిశువులకు అందిస్తున్న సేవల వివరాలను యూ - విన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌వో) డా. సాంబశివరావు సూచించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గర్భిణీల నమోదు, ప్రసవ వివరాలు, జనన సమయంలో అందించే టీకాలు, తదుపరి వ్యాక్సినేషన్ వివరాలను సకాలంలో యూ - విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. ప్రకాష్ మాట్లాడుతూ, యూ - విన్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయడం ద్వారా టీకాల కవరేజ్‌ను సమర్థవంతంగా పర్యవేక్షించే అవకాశం ఉంటుందని తెలిపారు. గర్భిణీలు, శిశువులకు అందించే టీకా సేవలపై ఖచ్చితమైన సమాచారం అందుబాటులో ఉండటంతో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మరింత మెరుగ్గా అమలు చేయవచ్చని చెప్పారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు ప్రతిరోజూ జరిగే ప్రసవాలు, నవజాత శిశువులకు అందించే సేవలు, జనన టీకాలు, వ్యాక్సినేషన్ సెషన్ల వివరాలను అదే రోజు యూ - విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. టీకాలు పొందిన ప్రతి లబ్ధిదారుడి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయడంతో పాటు పెండింగ్ ఎంట్రీలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డెమో అనిల్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆనంద్‌నగర్ కాలనీలో లిఫ్ట్ ప్రమాదం

### మహిళ మృతి..బాలుడికి తీవ్ర గాయాలు

**హైదరాబాద్,జూన్6(జై భీమ్ న్యూస్):**

ఖైరతాబాద్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆనంద్ నగర్ కాలనీలో ఉన్న భావన అపార్ట్‌మెంట్స్‌లో లిఫ్ట్ ప్రమాదంలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోగా, ఆమెతో ఉన్న మనవడు గాయపడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ ఆనంద్ నగర్ కాలనీలోని భావన అపార్ట్‌మెంట్స్ లో లిఫ్ట్‌లో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రాధ (58) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదం అపార్ట్‌మెంట్ 5వ అంతస్తులో జరిగింది. లిఫ్ట్ పూర్తిగా ఆ అంతస్తుకు చేరుకోకముందే బాధితురాలు తలుపు తెరిచింది. దీంతో ఆమె ఒక్కసారిగా లిఫ్ట్ గుంతలో పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెతో పాటు ఉన్న 13 నెలల మనవడు జియోల్ గాయపడటంతో వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

### ఇన్‌చార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయి



**హన్మకొండ, 6 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) మరింత వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన నూతన బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌వోల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతిరోజూ ఎస్ఐఆర్ ప్రక్రియలో మెరుగైన పురోగతి సాధించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమానికి సంబంధించిన మార్గదర్శకాలు, ఇంటింటి ధృవీకరణ, అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో నమోదు చేయడం, మరణించిన లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలను పరిశీలించడం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎలాంటి పొరపాట్లు లేకుండా ఓటరు జాబితాల నవీకరణ చేపట్టాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులను తప్పకుండా పాటిస్తూ, ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నాయబ్ తహసీల్దార్ ఎండి సుభాన్‌తో పాటు బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# నగరంలో చల్లబడ్డ వాతావరణం


### పలు ప్రాంతాల్లో ఆకస్మిక వర్షం

**హైదరాబాద్,జూన్6(జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్ నగరంలో శనివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బందిపడ్డ నగరవాసులకు భారీ వర్షం ఉపశమనం కలిగించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడగా, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఐటీ కారిడార్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అలాగే ఖైరతాబాద్, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. ఉప్పల్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, నిజాంపేట, శంషాబాద్, రాజేంద్రనగర్, గోల్కొండ ప్రాంతాల్లో కూడా వర్షం కురవడంతో నగరమంతా తడిసిముద్దయ్యింది. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. రహదారులపై వాహనాలు నెమ్మదిగా కదిలాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, పంజాగుట్ట, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో వర్షం పడటంతో ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు వాహనదారులు అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని సూచించారు. ఇక వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం.. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో మరికొన్ని గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, నీటిమునిగిన రహదారులపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. మరోవైపు, వర్షంతో నగరంలో ఉష్ణోగ్రతలు తగ్గి ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.

# వరి కొయ్యలు కాల్చిన రైతుకు రూ.5 వేల జరిమానా

**జగిత్యాల జిల్లా, 6 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**




పర్యావరణ పరిరక్షణ నిబంధనలను ఉల్లంఘిస్తూ వరి కొయ్యలను కాల్చిన రైతుకు గ్రామ పంచాయతీ అధికారులు రూ.5 వేల జరిమానా విధించిన ఘటన జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం రాజారాంతండా గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ రైతు తన వ్యవసాయ పొలంలో వరి కొయ్యలను తగులబెట్టడంతో పొగలు వ్యాపించి పర్యావరణ కాలుష్యానికి కారణమయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల మేరకు రైతుకు రూ.5 వేల జరిమానా విధించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరగడంతో పాటు నేలలోని సూక్ష్మజీవులు నశించి భూసారం తగ్గిపోతుందని అధికారులు తెలిపారు. రైతులు పంట అవశేషాలను దహనం చేయకుండా సేంద్రియ ఎరువుల తయారీకి, పశుగ్రాసంగా లేదా ఇతర వ్యవసాయ అవసరాలకు వినియోగించాలని సూచించారు. భవిష్యత్తులో కూడా పంట అవశేషాలను కాల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, రైతులు పర్యావరణ హిత వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని గ్రామ పంచాయతీ అధికారులు హెచ్చరించారు.

# వైట్‌ఫీల్డ్ మరియు ఎలక్ట్రానిక్ సిటీ వాసులారా, జాగ్రత్త. ఇది మీ ఊపిరితిత్తులపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలుసా

**బెంగళూరు మే 6 2026(జై భీమ్ న్యూస్)**

ఒకప్పుడు 'గార్డెన్ సిటీ'గా ప్రసిద్ధి చెందిన బెంగళూరు, తన పచ్చదనం మరియు ఆహ్లాదకరమైన ఖ్యాతిని కోల్పోతోంది. ఎలక్ట్రానిక్ సిటీ, వైట్‌ఫీల్డ్, సర్జాపూర్ రోడ్ మరియు ఔటర్ రింగ్ రోడ్ కారిడార్ల గుండా రోజూ ప్రయాణించే 15 లక్షలకు పైగా ప్రజలకు, వారు పీల్చే గాలి ఒక తీవ్రమైన ఆరోగ్య సమస్యగా మారింది. ఉదయం 8 గంటల రద్దీ సమయంలో, ఎలక్ట్రానిక్ సిటీ ఫేజ్-1లో గాలి నాణ్యత సూచిక (ఏ క్యూ ఐ ) 188కి (అనారోగ్యకరమైన స్థాయి) చేరుకుంటుంది. సాయంత్రం రద్దీ సమయంలో వైట్‌ఫీల్డ్‌లో కూడా ఇదే పరిస్థితి. ఐటీ పార్కుల నిర్మాణం, భారీ వాహనాల రద్దీ, మరియు ద్విచక్ర వాహనాలు, క్యాబ్‌ల రద్దీ ఈ కారిడార్లను స్థానిక కాలుష్య కేంద్రాలుగా మార్చాయి.

**ప్రయాణ విధానం వల్ల కలిగే ప్రమాదాలు:**

ద్విచక్ర వాహనదారులు మరియు ఆటో ప్రయాణికులు ముందున్న వాహనం నుండి వచ్చే పొగను నేరుగా పీలుస్తారు. ఏసీ క్యాబ్‌లలో కూర్చున్న వారు కూడా సురక్షితంగా లేరు; ఎందుకంటే సాధారణ వాహన ఫిల్టర్లు పీఎం 2.5 సూక్ష్మ కణాలను అడ్డుకోలేవు.

**ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం:**

ట్రక్కుల రద్దీ ఆస్తమాకు ఒక ప్రధాన కారణం కాగలదని 2025లో జరిగిన ఒక అధ్యయనం ధృవీకరించింది. ఇంటి వాతావరణం లేదా కుటుంబ నేపథ్యంతో సంబంధం లేకుండా, ట్రాఫిక్‌కు దగ్గరగా ఉండటమే ఒక పెద్ద ఆరోగ్య ప్రమాదం.

**నిపుణుల హెచ్చరిక**

బెంగళూరుకు చెందిన సీనియర్ పల్మనాలజిస్ట్ (ఊపిరితిత్తుల నిపుణుడు) డాక్టర్ మంజునాథ్ దీనిపై కొన్ని ఆలోచనలు పంచుకున్నారు. "దీర్ఘకాలిక ప్రయాణికుల గురించి నేను ఎక్కువగా ఆందోళన చెందుతున్నాను. నాలుగు నుంచి ఐదు సంవత్సరాలుగా రోజూ ప్రయాణిస్తున్న చాలామంది ఉదయం పూట ఛాతీలో బిగువుగా ఉండటం, పొడి దగ్గును సాధారణంగా భావిస్తారు. అయితే, సమస్య చివరి దశకు చేరుకున్నప్పుడు మాత్రమే వారు మా వద్దకు వస్తారు. అప్పటికే ఊపిరితిత్తులలో మార్పులు మొదలై ఉంటాయి. దీర్ఘకాలిక ప్రయాణికులు ముందుజాగ్రత్త చర్యగా ముందుగానే ఊపిరితిత్తుల పరీక్ష (స్పైరోమెట్రీ) చేయించుకోవడం అవసరం."




**పరిష్కారం**

2025 మధ్యకాలం నుండి అందుబాటులోకి రానున్న ఎలక్ట్రానిక్ సిటీ మెట్రో ఎల్లో లైన్ ఒక మంచి ముందడుగు. అయితే, మెట్రో స్టేషన్ నుండి ఐటీ పార్క్ వరకు ఉన్న చివరి మైలు కనెక్టివిటీ సమస్య మరియు అక్కడి దుమ్ముతో నిండిన రోడ్ల సమస్య ఇంకా పరిష్కారం కాలేదు.

**తరువాత ఏమిటి?**

బెంగళూరులోని ఐటీ కంపెనీలు తమ ఉద్యోగుల ఆరోగ్యాన్ని కాపాడటంలో చురుకుగా పాల్గొనాలి.

**ఆఫీసు పనివేళల్లో మార్పు:**

ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి షిఫ్టులను పంచుకోవడం. మెట్రో ప్రోత్సాహకాలు: రాయితీ ధరలకు మెట్రో పాస్‌లను అందించడం. ఆరోగ్య పరీక్షలు: కంపెనీ క్యాంపస్‌లలో క్రమం తప్పకుండా శ్వాసకోశ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి. బెంగళూరు ఐటీ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ స్థాయిలోనే ఉంది, కానీ మన రోజువారీ ప్రయాణం మరియు ఉద్యోగుల ఊపిరితిత్తుల ఆరోగ్య విధానాలను ఇంకా మెరుగుపరచాల్సిన అవసరం ఉంది.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# ఎల్కతుర్తిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభ ఘనంగా నిర్వహణ

**ఎల్కతుర్తి, 6 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించి, గ్రామ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు కనుగొనే లక్ష్యంతో ఎల్కతుర్తి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభ ఘనంగా జరిగింది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు విస్తృతంగా చర్చించారు. గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్ల పథకం, సామాజిక భద్రతా పెన్షన్లు, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్యం, అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం, పచ్చదనం పెంపు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. గ్రామ ప్రజలు తమ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. గ్రామసభల ద్వారా ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం వల్ల వాటి పరిష్కారం వేగవంతమవుతుందని పేర్కొన్నారు. ఎంపీఓ రవి మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసే వేదికలుగా నిలుస్తున్నాయని అన్నారు. గ్రామ ప్రజలు తమ సమస్యలు, అవసరాలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ప్రతి అర్హుడికి వాటి ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొని అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. గ్రామ సర్పంచ్ లావణ్య మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, గ్రామంలోని ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరించే దిశగా పంచాయతీ పనిచేస్తోందని చెప్పారు. గ్రామస్తులు సూచించిన అంశాలను ప్రాధాన్యతగా తీసుకుని సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్, వార్డు సభ్యులు, అధికారులు కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామంలో మరింత పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గ్రామసభ ముగిసిన అనంతరం గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు మురికి కాలువల సమస్యలు తీవ్రంగా ఉన్న ప్రాంతాలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. మిషన్ భగీరథ ఏఈ అనురాగ్ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాలను సందర్శించి, సమస్యల కారణాలు, పరిష్కార మార్గాలపై స్థానికులతో చర్చించారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, నీటి నిల్వలను నివారించడం, మురుగునీటి పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావణ్య, వార్డు సభ్యులు, ఎంపీఓ రవి, ఏవో రాజ్‌కుమార్, మిషన్ భగీరథ ఏఈ అనురాగ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎస్ఐ, పోలీసు సిబ్బంది, వీవోఏ కవిత, మహిళా సంఘాల సభ్యులు, మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జగన్ అంబాలతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై నిర్వహించిన ఈ గ్రామసభ గ్రామ ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు కొత్త దిశానిర్దేశం చేసినట్లు స్థానికులు అభిప్రాయపడ్డారు.




# గోపాల్‌పూర్ ఊర చెరువు అభివృద్ధిని అడ్డుకోవద్దు: బాధితుల విజ్ఞప్తి



**హన్మకొండ, 6 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

గోపాల్‌పూర్ ఊర చెరువు అభివృద్ధి పనులను రాజకీయ కారణాలతో అడ్డుకోవడం మానుకుని ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సహకరించాలని గోపాల్‌పూర్ ఊర చెరువు బాధితులు విజ్ఞప్తి చేశారు. శనివారం గోపాల్‌పూర్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, గత పదేళ్లుగా అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు చెరువు ఆక్రమణలను అరికట్టడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఒకప్పుడు 23 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊర చెరువు ప్రస్తుతం 8 ఎకరాలకు కుదించబడిందని, చెరువు పరిధిలో ఆక్రమణలు పెరగడం వల్ల వర్షాకాలంలో వరదలు సంభవించి పలు కాలనీలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. వరదల కారణంగా గోపాల్‌పూర్ పరిసర ప్రాంతాల్లో సుమారు రూ.70 కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించినప్పటికీ ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై అనేకసార్లు వినతిపత్రాలు అందజేసినా స్పందన రాలేదన్నారు. తమ సమస్యలను గుర్తించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు చెరువు పూడికతీతతో పాటు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కృషి చేస్తుండగా, కొందరు రాజకీయ నాయకులు సమాధుల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చి అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజల జీవితాలతో రాజకీయాలు చేయడం సరికాదని, చెరువు అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. తాము ఏ వర్గానికీ, ఏ కులానికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేసిన బాధితులు, సమాధులకు కూడా వ్యతిరేకం కాదన్నారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలని, అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివేక్‌నగర్ కాలనీ అధ్యక్షుడు మర్రి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి మీసాల రమేష్, సామాజిక కార్యకర్త తుపాకుల దశరథం, కోశాధికారి వినోద్‌రావు, అమరావతి నగర్ అధ్యక్షుడు భీమగాని యాదగిరి గౌడ్, నాయకులు రవీందర్‌రావు, బొప్ప శివశంకర్, నల్లని శ్రీనివాస్, బత్తుల సుదర్శన్ గౌడ్, డాక్టర్ సత్యనారాయణ, రమణారెడ్డి, దేవేందర్‌రెడ్డి, జితేందర్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# చేపల పెంపకంలో ఆధునిక సాంకేతికతలపై మత్స్యకారులకు ప్రత్యేక శిక్షణ



**పాలేరు, 6 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడంతో పాటు జలాశయాల్లో చేపల ఉత్పత్తిని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని ఫిషరీస్ రీసెర్చ్ స్టేషన్, పాలేరు కేంద్రంలో మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి (×జూ=) ఎస్సీ/ఎస్టీ సబ్ ప్లాన్ కింద ఈ శిక్షణ చేపట్టారు. హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం మడిపల్లి గ్రామానికి చెందిన కాందారి వెంకటస్వామి సహా పలువురు మత్స్యకారులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణలో చేపల పెంపకానికి అనుసరించాల్సిన ఆధునిక పద్ధతులు, చెరువులు మరియు జలాశయాల నిర్వహణ, నీటి నాణ్యత పరీక్షలు, నీటిలో పీహెచ్, అమోనియా, పొటాషియం తదితర రసాయనాల ప్రభావం గురించి నిపుణులు వివరించారు. అదేవిధంగా చేపల పిల్లల ఉత్పత్తి, క్రాస్ బ్రీడింగ్ విధానాలు, చేపల వృద్ధి వేగాన్ని పెంచే సాంకేతికతలు, చేపలకు కలిగే వ్యాధులను గుర్తించే పద్ధతులు, వ్యాధి నివారణ చర్యలు, మందుల వినియోగం, సమయానుకూలంగా ఆహారం అందించే విధానాలపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. జలాశయాల్లో కేజ్ కల్చర్, పెన్ కల్చర్, తెప్పల (రాఫ్ట్) వినియోగం, డిప్పా వలల నిర్వహణ, చేపల వేటకు ఉపయోగించే ఆధునిక పరికరాలు, మార్కెటింగ్ వ్యవస్థ, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటి అంశాలను కూడా శిక్షణలో వివరించారు. క్షేత్ర స్థాయిలో జలాశయాన్ని సందర్శించి ప్రత్యక్షంగా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మత్స్యకార సంక్షేమ పథకాలు, మత్స్య సహకార సంఘాలకు లభించే సబ్సిడీలు, స్వయం సహాయక బృందాలు, వ్యక్తిగత లబ్ధిదారులకు అందించే ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ ముగింపు సందర్భంగా పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. మత్స్యరంగంలో ఆధునిక సాంకేతికతలను అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని శాస్త్రవేత్తలు సూచించారు.




# పనితనం కాదు... పైసా నాకుడే లక్ష్యం!

**రెవెన్యూ శాఖలో అవినీతి దందా బహిర్గతం?**
**చనిపోయిన ఉద్యోగుల పేర్లపై జీతాల చెల్లింపుల ఆరోపణలు**
**"ఆకాశంలో ఉద్యోగులు" ఎవరనే ప్రశ్నతో రాష్ట్రవ్యాప్తంగా చర్చ**
**అవినీతి సొమ్ము పంచుకునే వ్యవస్థ?**
**రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితా?**

**హన్మకొండ జిల్లా, 6 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ శాఖలో అవినీతి వ్యవహారాలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాల్సిన ప్రభుత్వ యంత్రాంగంలో కొందరు అధికారులు, ఉద్యోగులు విధి నిర్వహణ కంటే అక్రమ సంపాదనకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూముల రికార్డులు, పహాణీలు, వారసత్వ ధృవపత్రాలు, మ్యుటేషన్లు, ఇతర రెవెన్యూ సేవలకు సంబంధించి లంచాలు లేకుండా పనులు జరగడం కష్టంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ స్థాయిలో ప్రజలకు అత్యంత చేరువలో ఉండే విఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సి ఉండగా, కొందరు మాత్రం పనులను ఉద్దేశపూర్వకంగా పెండింగ్‌లో ఉంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పేదలు, రైతులు, సాధారణ ప్రజలు తమ హక్కుల కోసం కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరుగుతున్నా సరైన స్పందన లభించడం లేదని వాపోతున్నారు. "డబ్బు ఉంటే గంటల్లో పని -- లేకపోతే నెలల తరబడి నిరీక్షణ" అనే పరిస్థితి నెలకొన్నట్లు బాధితులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, రెవెన్యూ శాఖలో అత్యంత సంచలనంగా మారిన అంశం చనిపోయిన ఉద్యోగుల పేర్లపై కూడా జీతాలు డ్రా అవుతున్నాయనే ఆరోపణలు. ఇప్పటికే మరణించిన ఉద్యోగుల వివరాలను అధికారిక రికార్డుల నుంచి తొలగించకుండా కొనసాగిస్తూ, వారి పేరిట జీతాలు తీసుకుంటూ కొందరు అక్రమ లావాదేవీలకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆరోపణలు ఎంతవరకు నిజమో అధికారికంగా తేలాల్సి ఉన్నప్పటికీ, ప్రజల్లో మాత్రం తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చనిపోయిన ఉద్యోగుల సేవా వివరాలు, పేరోల్ రికార్డులు, బ్యాంకు ఖాతాల లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు జరిగితే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు "ఆకాశంలో ఉద్యోగులు" అనే పదం ప్రస్తుతం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. కార్యాలయాలకు హాజరు కాకుండా, విధులు నిర్వర్తించకుండా కొందరు ఉద్యోగులు జీతాలు పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలు తమ పనుల కోసం కార్యాలయాలకు వెళ్లినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడం, ఫైల్స్ పేరుతో ఆలస్యం చేయడం, సిబ్బంది కొరత ఉందని చెప్పడం వంటి అంశాలు ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. అవినీతి వ్యవహారాల్లో కొందరు అధికారులు, మధ్యవర్తులు కలిసి వ్యవస్థను దోపిడీ సాధనంగా మార్చుకున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. "అవినీతి సొమ్ము నాకింత -- నీకింత" అన్నట్లుగా అక్రమ డబ్బుల పంపకం జరుగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. చిన్న పనుల నుంచి పెద్ద భూ వివాదాల పరిష్కారం వరకు ప్రతిదానికీ రేట్లు నిర్ణయించి వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దీనివల్ల ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల విశ్వాసం క్రమంగా దెబ్బతింటోందని సామాజిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ వ్యవహారం ఒకటి రెండు జిల్లాలకు మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలు ప్రాంతాల్లో ప్రజలు అధికారులపై ఫిర్యాదులు చేసినప్పటికీ వాటిపై సమగ్ర విచారణలు జరగలేదనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికారులు రాజకీయ అండదండలతో చర్యల నుంచి తప్పించుకుంటున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ప్రభుత్వాన్ని పలు కీలక డిమాండ్లు చేస్తున్నారు. చనిపోయిన ఉద్యోగుల పేర్లపై జీతాల చెల్లింపులపై ప్రత్యేక విచారణ జరపాలని, రాష్ట్రవ్యాప్తంగా పేరోల్ వ్యవస్థపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని, హాజరు కాని ఉద్యోగుల వివరాలను బహిర్గతం చేయాలని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే రెవెన్యూ సేవలను పూర్తిగా పారదర్శకంగా మార్చేందుకు డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని, అవినీతి నిరోధక శాఖ ద్వారా ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు సేవలందించాల్సిన రెవెన్యూ శాఖపై ఇలాంటి ఆరోపణలు రావడం ప్రభుత్వ ప్రతిష్ఠకు మచ్చగా మారుతోందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఆరోపణల్లో ఎంతవరకు నిజం ఉందో తేల్చేందుకు ప్రభుత్వం తక్షణమే ఉన్నతస్థాయి విచారణకు ఆదేశాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే "పనితనం కాదు... పైసా" అనే భావన మరింత బలపడే ప్రమాదం ఉందని, ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల నమ్మకం పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.




# మందుల నిల్వలు, పంపిణీ రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలి: డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ. అప్పయ్య

**హన్మకొండ, 6 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి వచ్చిన మందులు, అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీలు) నుంచి ఆరోగ్య ఉపకేంద్రాలు, సిబ్బందికి పంపిణీ చేసిన మందుల బ్యాచ్ నంబర్, గడువు తేదీతో పాటు ఇతర వివరాలన్నింటినీ సంబంధిత రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేసి పకడ్బందీగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఏ. అప్పయ్య సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఫార్మసీ ఆఫీసర్ల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముందుగా వచ్చిన మందులను ముందుగా వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ఏదైనా పీహెచ్‌సీలో తక్కువ వినియోగంలో ఉన్న మందులను సమీపంలోని అవసరమున్న పీహెచ్‌సీలకు తరలించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా యాంటీ రేబిస్ వ్యాక్సిన్, యాంటీ స్నేక్ వెనం ఔషధాల నిల్వల వివరాలను సమీక్షించిన ఆయన, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని రకాల మందులను తగిన మోతాదులో నిల్వ ఉంచుకోవాలని ఆదేశించారు. వ్యాక్సిన్ కోల్డ్ చైన్ వ్యవస్థకు ఎలాంటి అంతరాయం కలగకుండా టీకాలను నిర్దేశిత ఉష్ణోగ్రతలో భద్రపరచాలని సూచించారు. ఔషధాల నిల్వలు, పంపిణీ, వినియోగానికి సంబంధించిన అన్ని వివరాలను ఈ-ఔషధి పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఔషధాల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ. అప్పయ్య తెలిపారు.



# మద్యనిషేధ హామీని గాలి కొదిలేసిన జగన్

**సిపిఎస్ రద్దు చేస్తామని మోసం చేసిన వైసిపి**
**జాబ్ క్యాలెండర్ పేరుతోనూ మోసం చేశారు**
**టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో భేటీ చంద్రబాబు విమర్శలు**

**అమరావతి, జూన్6(జై భీమ్ న్యూస్):**

మద్యపానం నిషేధం చేస్తామని హామీ ఇచ్చి గొడ్డలి పార్టీ చేతులెత్తేసిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. వైసీపీ హయాంలో సీపీఎస్ వారం రోజుల్లో రద్దు చేస్తామని చెప్పి ఎందుకు పక్కన పెట్టేసిందని ప్రశ్నించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని గొడ్డలి పార్టీ మాట తప్పిందని ధ్వజమెత్తారు. ఇంతటితో ఆగకుండా వ్యవస్థలను విధ్వంసం చేసిందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో చెప్పినవి చేయకపోగా తమ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2025పై బురద జల్లుతోందని ఆగ్రహించారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యపై ఎలా దుష్ప్రచారం చేసి లబ్ది పొందారో... డీఎస్సీ విషయంలోనూ దుష్ప్రచారంతో లబ్దిపొందాలనుకున్నారని దుయ్యబట్టారు. డీఎస్సీ నిర్వహణపై ఆధారాలతో సహా జగన్ అండ్ కోకు కౌంటర్ ఇచ్చామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్‌తో గొడ్డలి పార్టీ నేతలు డిఫెన్సులో పడ్డారని చెప్పుకొచ్చారు. దుష్ప్రచారం చేయడం, ఫేక్ రాజకీయాలు చేయడం గొడ్డలి పార్టీ విధానం, సిద్ధాంతమని విమర్శించారు. అధికారంలో ఉన్నామని... సహనం, ఓపిక అవసరమని.. కానీ గొడ్డలి పార్టీ ఆగడాలు శ్రుతిమించితే వదిలిపెట్టమని హెచ్చరించారు. మంచి ఆలోచనలు చేసే వాళ్లకు మంచి వాళ్లే సహాయపడతారని అన్నారు. చెడు ఆలోచనలు చేసే వాళ్ల చుట్టూ గొడ్డలి బ్యాచ్ జమ అవుతుందని ఎద్దేవా చేశారు. ఇకపై టీడీపీకి ఓటమి లేదని, రాదని తెలిపారు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలతో మంచిగా ఉంటున్నామని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నామని.. సంక్షేమ పథకాలు - అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చామని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా ఆత్మవిమర్శ చేసుకుంటున్నామని.. అందుకే టీడీపీకి ఓటమి రాదని పేర్కొన్నారు. పార్టీ పదవులు మొదలుకుని టికెట్ల కేటాయింపుల వరకు నిరంతరం సర్వేలు చేయిస్తున్నామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వాళ్లని వదిలించుకుంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఏం ప్రచారం చేశారో... అవన్నీ తమ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న మంచిని గడప గడపకు వెళ్లి చెప్పాలని దిశానిర్దేశర చేశారు. ఆనాడు చెప్పిన వాటిని ఈనాడు నెరవేరుస్తున్నామనే విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. మంగళగిరిలో టీడీపీ గెలిచి చాలా కాలమైందని... 2019 ఎన్నికల్లో నారా లోకేశ్ పోటీ చేసినా ఓడిపోయారని ప్రస్తావించారు. ఆ తర్వాత పట్టుపట్టి పనిచేశారని.. 2024లో అద్భుత విజయం సాధించారని ప్రశంసించారు. గెలిచిన తర్వాత కూడా మంగళగిరిలో లోకేశ్ చక్కగా పని చేస్తున్నారని.. ఇప్పుడు మంగళగిరి టీడీపీకి కంచుకోటగా మారిందని చెప్పుకొచ్చారు. యుద్ధాన్ని గెలిపించే బాధ్యత తనదని... తనతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత టీడీపీ శ్రేణులదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలోనూ గతానికి మించి ఓట్లు రావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ పరంగా చేయాల్సిందంతా చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని... ప్రభుత్వం చేసే అభివృద్ధిని అందిపుచ్చుకునేలా కార్యకర్తలు ఆలోచించాలని అన్నారు. భవిష్యత్తు రాజకీయాలకు కూటమితోనే వెళ్తున్నామని.. వెళ్తామని స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ముందు బీజేపీతో పొత్తులో ఉన్నా కూడా ఓట్లు చీలకూడదనే.. టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారని అన్నారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా వెళ్లడంతోనే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచామని ప్రస్తావించారు. పార్టీ అగ్రనేతలు మొదలుకుని... కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ బ్రాడ్ మైండ్‌తో ఆలోచించాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు.

# నిరుద్యోగులకు శుభవార్త..

**టీజీపీఎస్సీ నుంచి మరో ఉద్యోగ ప్రకటన**
**విద్యాశాఖలో డీవైఈవో, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పోస్టుల భర్తీ**
**మొత్తం 24 ఉన్నత స్థాయి పోస్టులకు టీజీపీఎస్సీ నోటిఫికేషన్**
**జూన్ 12 నుంచి జులై 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**
**పునర్వ్యవస్థీకరణ తర్వాత నియామక ప్రక్రియను వేగవంతం చేసిన కమిషన్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) వరుసగా శుభవార్తలు అందిస్తోంది. కమిషన్ పునర్వ్యవస్థీకరణ తర్వాత నియామక ప్రక్రియలో స్పష్టమైన వేగం కనబరుస్తూ, కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే రెండో కీలక ఉద్యోగ ప్రకటనను జారీ చేసింది. రాష్ట్ర విద్యాశాఖలో పరిపాలన, పర్యవేక్షణను బలోపేతం చేసే లక్ష్యంతో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ (డీవైఈవో), గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్-1 పోస్టుల భర్తీకి అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24 గెజిటెడ్ స్థాయి పోస్టులను భర్తీ చేయనున్నట్లు టీజీపీఎస్సీ ప్రకటించింది. చాలాకాలంగా ఖాళీగా ఉన్న ఈ ఉన్నత స్థాయి పోస్టులను భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థల పనితీరును మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నియామకాలు విద్యా వ్యవస్థలో క్షేత్రస్థాయి పర్యవేక్షణను పటిష్ఠం చేయడానికి దోహదపడతాయని నిపుణులు భావిస్తున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల అర్హతలకు సంబంధించి కమిషన్ స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. 2026 జులై 1 నాటికి అభ్యర్థుల వయస్సు తప్పనిసరిగా 18 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిని 44 ఏళ్లుగా నిర్ణయించారు. అయితే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయని కమిషన్ స్పష్టం చేసింది. ఈ సడలింపుల వల్ల సీనియర్ అభ్యర్థులకు సైతం దరఖాస్తు చేసుకునేందుకు మంచి అవకాశం లభించనుంది. అర్హులైన అభ్యర్థులు జూన్ 12వ తేదీ నుంచి ఆన్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులను సమర్పించవచ్చు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీగా జులై 19ని నిర్ణయించారు. చివరి నిమిషంలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అభ్యర్థులు గడువు తేదీలోగా ముందే దరఖాస్తు చేసుకోవడం మంచిదని కమిషన్ సూచించింది. ఈ పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాలు, విద్యా అర్హతలు, పరీక్షా విధానం, సిలబస్, జిల్లాల వారీగా ఖాళీల కేటాయింపు, దరఖాస్తు రుసుము వంటి సమగ్ర సమాచారం కోసం అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ స్త్రజూం.ఎ.స్త్రశీజ.ఱఅ ను సంప్రదించాలని కమిషన్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమయ్యే నాటికి వెబ్‌సైట్‌లో పూర్తిస్థాయి నోటిఫికేషన్ పీడీఎఫ్‌ను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

# వర్షాకాలం వస్తోంది జాగ్రత్త

**ముందస్తు చర్యలకు సిద్ధం కండి**
**ధాన్యం కొనుగోళ్లు, సిఎం పర్యటనలపై జాగ్రత్తలు**
**కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎస్ ఆదేశాలు**



**హైదరాబాద్,జూన్6(జై భీమ్ న్యూస్):**

తెలంగాణలో వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాని, ముందస్తు చర్యలకు దిగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల పరిస్థితులు, వరి కొనుగోళ్లు, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో వర్షాల ప్రభావంపై ప్రత్యేకంగా చర్చించిన సీఎస్, అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వరి కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని జిల్లా యంత్రాంగానికి సీఎస్ సూచించారు. వర్షాల పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల హెచ్చరికలు, వరి కొనుగోళ్లు, సీఎం పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపైనా సీఎస్ అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, ప్రజాసభల నిర్వహణ, రవాణా సౌకర్యాలు, వసతి ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.

# పోలీసులకు లొంగిపోయిన సిఐ చినమల్లయ్య

**పల్నాడు,జూన్6(జై భీమ్ న్యూస్):**

అత్యాచారం కేసులో గత కొన్ని వారాలుగా పరారీలో ఉన్న సీఐ చినమల్లయ్య ఎట్టకేలకు శనివారం తెల్లవారుజామున సుమారు 5 గంటల ప్రాంతంలో వినుకొండ పోలీస్ స్టేషన్‌కు వచ్చి అధికారుల ముందు లొంగిపోయారు. తనపై సీఐ చినమల్లయ్య అత్యాచారం చేశాడంటూ.. ఏప్రిల్ 29న ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై కేసు నమోదైంది. నాటి నుంచి అరెస్ట్ భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిన చినమల్లయ్య, పోలీసులకు దొరకకుండా తప్పించుకుంటూనే ముందస్తు బెయిల్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే, ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను అటు ఆంధ్రప్రదేశ్ హైకోర్టుతో పాటు, ఇటు దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు కూడా కొట్టివేయడంతో ఆయనకు చట్టపరంగా ఎలాంటి ఊరట లభించలేదు. అన్ని కోర్టుల్లోనూ పిటిషన్లు తిరస్కరణకు గురికావడంతో అరెస్ట్ తప్పదని భావించిన చినమల్లయ్య, చివరికి వినుకొండ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ప్రస్తుతం ఆయనను అదుపులోకి తీసుకున్న పోలీసులు తదుపరి విచారణ జరుపుతున్నారు.

# గిగ్ వర్కర్లుగా మహిళలు

**స్త్రీ రైడ్ ప్రోగ్రామ్ కింద 55మందికి శిక్షణ**
**'స్త్రీ రైడ్' ప్రాజెక్టును ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్**

**హైదరాబాద్,జూన్6(జై భీమ్ న్యూస్):**

గిగ్ వర్కర్లలో ఇప్పుడు మహిళలు కూడా చేరబోతున్నారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో స్త్రీ రైడ్స్‌ను తీసుకొచ్చామని పేర్కొన్నారు. 55 మంది మహిళలకు డ్రైవింగ్ నేర్పించి, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పుకొచ్చారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఆత్మవిశ్వాసం, సమాజంలో వారి భద్రతను పెంపొందించడమే ధ్యేయంగా తెలంగాణ పోలీస్ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విమెన్ సేఫ్టీ వింగ్, రాష్ట్ర రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన 'స్త్రీ రైడ్' ప్రాజెక్టును హైదరాబాద్‌లో డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. మహిళలు రవాణా, డెలివరీ రంగాల్లో స్వయం ఉపాధి సాధించేలా ప్రోత్సహించేందుకు ఈ-బైక్స్, ఈ-ఆటోలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. తొలి విడతలో 55 మంది మహిళలకు స్త్రీ రైడర్లుగా అవకాశం కల్పించారు. అంబర్‌పేట పోలీస్ లైన్స్‌లో వీరికి టూ వీలర్, త్రీ వీలర్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చారు. 55 మంది మహిళలకు ఈమేరకు డ్రైవింగ్ లైసెన్సులు అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు సురక్షిత రవాణా సేవలు అందించేలా ఈ కార్యక్రమం చేపట్టారు. జొమాటో, స్విగ్గీ తరహా డెలివరీ సేవల్లో మహిళల భాగస్వామ్యంపై డీజీపీ హర్షం వ్యక్తం చేశారు. నాలుగు నెలల్లో మహిళా రైడర్ల సంఖ్యను మూడింతలు పెంచాలన్నారు. మహిళల ఉపాధి, సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు. ఇప్పటివరకు గిగ్ వర్క్‌లో పురుషులు ఉండేవారని, ఇప్పటినుంచి మహిళలు కూడా రాబోతున్నారని తెలిపారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారిత సాధించాలని ఆనంద్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చరిత్రలో లా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్‌కు.. మహిళా ఎస్‌హెచ్‌వో లేరని డీజీపీ ఆనంద్ వివరించారు. తాను హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మహిళా ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమించానని ప్రస్తావించారు. ఇప్పుడు 55 మంది మహిళలు ప్యాసింజర్ రవాణా సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో తెలంగాణ అంతటా లాజిస్టిక్, కార్గో, డెలివరీ సర్వీసెస్‌లో మహిళా డ్రైవర్లకు అవకాశం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. దేశ జీడీపీ పెరగాలంటే మహిళలు కూడా ధైర్యంగా బయటకు వచ్చి పని చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు.

# గండిపేట భూకబ్జా కేసు

**వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లాకు 14 రోజుల రిమాండ్**
**చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు**

**హైదరాబాద్,జూన్6(జై భీమ్ న్యూస్):**

గండిపేట భూకబ్జా కేసులో అరెస్టైన వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయనను చంచల్‌గూడా జైలుకు తరలించారు. ఈ కేసు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, భూకబ్జా కేసులో నిందితుడిగా ఉన్న బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు తమిళనాడులోని కాంచీపురంలో అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు తీసుకువచ్చి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో భాగంగా స్టేట్‌మెంట్ నమోదు చేసిన అధికారులు, ఆ తర్వాత న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. బొల్లా బ్రహ్మనాయుడిని నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్నారనే సమాచారం అందడంతో వైసీపీ కార్యకర్తలు, ఆయన అనుచరులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా పోలీస్ స్టేషన్‌లోకి ఎవరినీ అనుమతించ లేదు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నార్సింగి పోలీస్ స్టేషన్ నుంచి బొల్లా బ్రహ్మనాయుడిని కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉప్పరపల్లి కోర్టుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వాదనలు విన్న కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం చంచల్‌గూడా జైలుకు పంపించారు. గండిపేట భూకబ్జా కేసులో ఇప్పటికే ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు అరెస్టుతో మొత్తం అరెస్టుల సంఖ్య ఆరుకు చేరాయి. ఈ కేసులో మరికొంతమందిని కూడా విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భూకబ్జాకు సంబంధించిన పలు కోణాల్లో సైబరాబాద్ పోలీసులు విచారణ చేపట్టారు. భూముల ఆక్రమణ, పత్రాల వ్యవహారం, సంబంధిత వ్యక్తుల పాత్ర వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా మరిన్ని చర్యలు చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. గండిపేట భూకబ్జా కేసులో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి అరెస్ట్, అనంతరం కోర్టు రిమాండ్

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

**ఇదే తమ మొదటి డిమాండ్..కొనసాగిస్తాం కూడా**
**ప్రవేశ పరీక్షల అవతవకలకు బాధ్య వహించాల్సిందే**
**కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే డిమాండ్**
**జంతర్ మంతర్ వద్ద ధర్నా...ధర్నాలో పాల్గొన్న పర్యావరణవేత్త వాంగ్‌చుక్**

**న్యూఢిల్లీ,జూన్6(జై భీమ్ న్యూస్):**




నీట్ తదితర ప్రవేశ పరీక్షలు, రిక్రూట్మెంట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించేందుకు ప్రస్తుత విద్యా వ్యవస్థను సంస్కరించాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ శనివారంనాడు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనలకు నాయకత్వం వహించగా, ప్రముఖ విద్యావేత్త, యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్, పార్టీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ ఆరంభం మాత్రమేనని సీజేపీ స్పష్టం చేసింది. సీజేపీ మద్దతుదారులను ఉద్దేశించి అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకూ నిరసనలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇంకెంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేంత వరకూ అధికారులు వేచిచూస్తారని నిలదీశారు. తమ డిమాండ్ల నెరవేరేంత వరకూ ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. నిరసనలకు దిగితే జైలులో పెడతారేమోనని తన తల్లి భయపడినట్టు దీప్కే చెప్పారు. 'తమ పిల్లలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే ఏమవుతుందోనన్న భయం ఈ దేశంలోని ప్రతి తల్లికి ఉంది. ఈ ప్రభుత్వానికి భయపడి ఎంతకాలం బతకాలని ఆయన ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని నెలరోజుల నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ చర్చలు తీసుకోవడం లేదని, దీనికి బదులు ఇతర అంశాలపైనే వాళ్లు దృష్టి పెట్టారని అన్నారు. సీజేపీ అకౌంట్లు హ్యాక్ చేయడం, పోస్టులు డిలీట్ చేయడం చేస్తున్నారని చెప్పారు. పోస్టులను డిలీట్ చేయవచ్చు కానీ, తమను ఏమార్చలేరని అన్నారు. పేపర్ లీక్‌లు, విద్యావ్యవస్థలో తప్పిదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల పేర్లను ఆయన చదవి వినిపించారు. విద్యార్థుల మృతికి సీజేపీ సంతాపం ప్రకటించింది. జంతర్‌మంతర్ నిరసనల్లో పాల్గొనేందుకు ఆయన అమెరికాలోని బోస్టన్ నుంచి ఢిల్లీకి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను చేత్తో పట్టుకుని కనిపించారు. జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ విద్యాశాఖ మంత్రిగా ఆయన ఉండాలని కోరారు. అయితే తనకు రాజకీయాల్లో ప్రవేశించాలనే ఆలోచన లేదని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. యువకులే ఆ బాధ్యత చేపట్టాలన్నారు. రాజకీయవేత్తలు, ప్రభుత్వ అధికారుల పిల్లలు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదవాలని తాను కోరుకుంటు న్నట్టు చెప్పారు. సీజేపీ నిరసనలకు ప్రభుత్వం అనుమతించడాన్ని ఆయన స్వాగతించారు. నిరసన తెలపడం తనకు ఇష్టం లేకున్నా న్యాయం కోసమే ఆ పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న విద్యావ్యవస్థలో మార్పు జరగాలని అన్నారు. కాగా, తదుపరి నిరసన ప్రదర్శనను జూన్ 23న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించే ఆలోచనలో సీజేపీ ఉంది. ఈ కార్యక్రమంలో వందలాదిమంది యువత పాల్గొని కాక్రోజ్ జనతాపార్టీకి మద్దుతగా నిలిచారు.

## కాక్‌టెయిల్-2 లో నటించడానికి భయపడ్డా: రష్మిక





కొద్ది రోజుల్లో 'కాక్‌టెయిల్ 2'తో ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతోంది అందాల తార రష్మిక. ఆమె, షాహిద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో దియా పాత్రలో కనిపించనుంది రష్మిక. ఈ నేపథ్యంలోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న రష్మిక.. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. 'ఈ ప్రాజెక్టులో నటించడం గురించి నేను అంత సులభంగా నిర్ణయం తీసుకోలేదు. ముఖ్యంగా ఇందులో నటించడానికి నిజంగా భయపడ్డాను. ఎందుకంటే ఇప్పటి వరకు నేను భాగమైన చిత్రాల్లో ఇంత మోడ్రన్‌గా కనిపించలేదు. అందుకే ప్రారంభంలో ఈ చిత్రంలో నటించడం గురించి నేను తీసుకున్న నిర్ణయం సరైందా? కాదా? అనే సందేహం ఉండేది. కానీ అదే సమయంలో ఇంతకు ముందెప్పుడూ ఇలాంటి పాత్రలో చేయలేదు కాబట్టి.. ఇందులో నటించాను' అని చెప్పింది.

## జూలై నుంచి కల్కి-2 రెగ్యులర్ షూటింగ్

ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న 'కల్కి 2' అప్‌డేట్ గురించి నాగ్ అశ్విన్ క్లారిటీ ఇచ్చారు. సినిమా పనుల గురించి వివరణ చేస్తూ.. కల్కి 2 షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. వచ్చే జూలై నుండి కంటిన్యూగా షూటింగ్ ప్లాన్ చేశాం. చాలా శరవేగంగా షూటింగ్ పూర్తి చేసేలా అన్ని సన్నాహాలు జరుగుతున్నాయని నాగ్ అశ్విన్ వెల్లడించారు. ఈ అప్‌డేట్‌తో ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

## రామాయణ, వారణాసి బడ్జెట్ లెక్కలు

### హైప్ క్రియేట్ చేస్తున్నారని కొట్టి పారేసిన మనోజ్




రామాయణ' పై 4000 కోట్ల బడ్జెట్ పెట్టారు. పాన్ ఇంటర్నేషనల్ మూవీ 'వారణాసి', 1300 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతోంది. రామాయణ, వారణాసి బడ్జెట్ షాక్ ఇస్తోంది. అయితే ఇందులో ఎంతమాత్రం నిజం లేదని ఇదంతా కేవలం హైప్ క్రియేట్ చేయడానికే అని బాలీవుడ్ యాక్టర్ మనోజ్ బాజ్‌పాయ్ తేల్చి పారేసాడు. రాజమౌళి అంటేనే బ్జడెట్. తెలుగు తెరకే కాదు, ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌కు భారీ బ్జడెట్, భారీ వసూళ్లు ఎలా ఉంటాయో చూపించాడు రాజమౌళి. తెలుగు సినిమా బ్జడెట్ 20 కోట్ల లోపే ఉన్న సమయంలో, 'మగధీర' పై 40 కోట్లు పెట్టించాడు. బాక్స్ ఆఫీస్ దగ్గర 50 కోట్ల మార్కు దాటిన తొలి చిత్రంగా 'మగధీర' నిలిచింది. ఇక 'బాహుబలి 2' తో రాజమౌళి సెట్ చేసిన రికార్డులు ఇప్పటికీ కొన్ని చోట్ల పదిలంగానే ఉన్నాయి. మరి ఇంత ట్రాక్ రికార్డు ఉన్న రాజమౌళి, 'వారణాసి' తో పాన్ ఇంటర్నేషనల్‌కు పరిచయం అవుతున్నాడు. దీనికి తగ్గట్టే బ్జడెట్ పెంచేసాడు. 'వారణాసి' 800 కోట్ల బ్జడెట్‌తో మొదలైంది. సెట్స్ పైకి వెళ్ళాక 1000 కోట్లు అన్నారు. ఏడాది పాటు షూటింగ్ పూర్తి చేశాక, 1300 కోట్లకు వెళ్ళిందన్నారు. సినిమా పూర్తి అయ్యేసరికి 1500 కోట్లకు చేరినా ఆశ్చర్యం లేదు. బాలీవుడ్ యాక్టర్ మనోజ్ బాజ్‌పాయ్, రామాయణ, వారణాసి బ్జడెట్‌పై చేసిన షాకింగ్ కామెంట్స్ వైరల్ అయ్యాయి. ఈ సినిమాల బ్జడెట్ లెక్కలన్నీ కేవలం పిఆర్ టీం స్టంట్ అని ఆయన అభిప్రాయపడ్డాడు. 15 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఇదే తంతు నడుస్తోందని, హైప్ కోసం చెప్పే నంబర్స్ అంటూ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. 4 వేల కోట్ల బ్జడెట్‌తో హిందీ 'రామాయణ' తెరకెక్కుతోంది. ఒక్కో పార్ట్‌కు 2000 కోట్లు ఖర్చు పెడుతున్నారు. దాదాపు సగం పైగా బ్జడెట్ వీఎఫ్ఎక్స్ కే ఖర్చు పెడుతున్నారట. ఎన్ని కోట్లు పెట్టినా 4000 కోట్ల బడ్జెట్ అనేది నమ్మేలా లేదంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మనోజ్ బాజ్‌పాయ్ చెప్పిన పిఆర్ టీం బ్జడెట్ లెక్కల్లో ఎంత నిజం ఉందో లేదో గానీ, ఈ కామెంట్స్ పెద్ద చర్చకు దారితీశాయి. మనోజ్ నటిస్తున్న 'గవర్నర్' మూవీ 12న రిలీజ్ అవుతోంది. సినిమా వస్తోందన్న సంగతి చాలామందికి తెలియడం లేదు, అందుకే తన సినిమాకు హైప్ తీసుకొచ్చేందుకే ఇలా మాట్లాడాడంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.

# విమర్శలు కూడా సృజనాత్మకతగానే చూడాలి



### నటి అనసూయా భరద్వాజ్

సినిమా అంటేనే కేవలం కల్పిత కథ అని.. అందులోని తప్పొప్పులు నిర్ణయించుకునే పూర్తి విచక్షణ మనపైనే ఉంటుందని నటి అనసూయ భరద్వాజ్ అన్నారు. సమాజంలో జరిగే విషయాలకు సినిమాలతో ముడిపెట్టొద్దని అన్నారు. చిత్రరంగంపై బాధ్యత, సృజనాత్మక స్వేచ్ఛ గురించి ఆమె సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'ఒకప్పటి కథలలో నైతికత కనిపించేది. హీరో పాత్రలు స్ఫూర్తిదాయకంగా ఉండేవి. విలన్ పాత్రలు మనం అనుకరించకూడదు అనిపించేలా ఉండేవి. ఈ రోజుల్లో తెరకెక్కే కథల్లో ఈ స్పష్టత లోపిస్తోంది. పాత్రను గొప్పగా చూపించడం కోసం దర్శకులు ఈ గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. ఒక కథను తెరకెక్కిస్తున్నామంటే.. దాని ప్రభావం ఎలా ఉంటుందనే దానిలో టెక్నికల్ టీమ్ నుంచి దర్శక నిర్మాతలు, నటీనటులు, చివరకు ప్రేక్షకులు కూడా కీలక పాత్రధారులే. అందుకే సినిమా ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఉండాలి. సృజనాత్మకత విషయంలో వచ్చిన భేదాభిప్రాయాల వల్ల నేను కొన్ని షోల నుంచి వైదొలిగిన సందర్భాలూ ఉన్నాయి. దానివల్ల నా ప్రతిభకు తగిన అవకాశాలు రావడంలో ఇబ్బందులూ ఎదుర్కొన్నా. అంత కష్టంలోనూ నా సిద్ధాంతాల కోసమే నిలబడ్డాను అని అనసూయ చెప్పారు. సృజనాత్మక స్వేచ్ఛ అనేది చాలా అవసరం. అదే సమయంలో సామాజిక స్పృహ ఉండటం కూడా అంతే ముఖ్యం. సినిమాలు సమాజాన్ని మంచి మార్గంలో ముందుకు నడిపించాలని ఆశించకూడదు. అలాగని సమాజంపై ఎలాంటి ప్రభావం చూపవని కూడా అనుకోకూడదు. సమాజంలో జరిగే ప్రతి విషయానికి సినిమాను నిందించలేం. సోషల్ మీడియాలో చాలామంది ముందుకువచ్చి ఇలాంటి విషయాలపై చర్చలు పెట్టడం, కథల్లో పాత్రలను చూపించే విధానాలను ప్రశ్నించడం, విమర్శనాత్మకంగా ఆలోచించడాన్ని చూస్తుంటే నాకు నిజంగా సంతోషంగా ఉంది. అవసరమైనప్పుడు తప్పులను ప్రశ్నించడం అంటే సృజనాత్మకతపై దాడి చేయడం కాదు, అది సమాజంలో అవగాహన పెంచడం మాత్రమే' అని అనసూయ వివరించారు.